బడి గంటలు మోగిన వేళ.!


బాచుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మొదటి రోజు.. ఉత్సాహంగా విద్యార్థులు

మొదటి రోజు పాఠశాలలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. కొన్ని పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉన్నా పలు పాఠశాలల్లో 50 శాతానికి మించి విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. బుధవారం మొదటి రోజు కావడంతో కాస్త హాజరు శాతం తగ్గిందన్నారు. రెండు మూడు రోజుల్లో 90 శాతం హాజరవుతారని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాగా ఆయా తరగతులకు సంబంధించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఆయా పాఠశాలలకు ఇప్పటికే చేరుకోవడంతో వాటిని త్వరలోనే విద్యార్థులకు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.

– నిజాంపేట్


తరగతి గది కాస్త పలచగా కనబడుతున్న విద్యార్థుల హాజరు శాతం


నిజాంపేట్ ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు


దూలపల్లిలో..

బస్సులకు ఫిట్‌నెస్‌తో సేఫ్టీ పరికరాలు ఉండాలి





- డీటీఓ రఘునందన్‌గౌడ్
- విద్యాసంస్థల బస్సుల తనిఖీలు

కుత్బుల్లాపూర్: ఫిట్‌నెస్ లేకుండా.. ఎలాంటి సేఫ్టీ పరికరాలు దగ్గర ఉంచుకోకుండా.. సామర్థ్యాన్ని మించి విద్యార్థులను ఎక్కించుకుని నడుపుతున్న పలు ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులను మేడ్చల్ జిల్లా రవాణా అధికారి రఘునందన్‌గౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. బుధవారం నుంచి విద్యాసంస్థలు తెరుచుకోవడంతో పలు బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించుకోకుండానే నడుపుతున్న వాటిని గుర్తించి సీజ్ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుత్బుల్లాపూర్ సుచిత్ర రోడ్డు నుంచి మేడ్చల్ వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టి సుమారు 11 బస్సులను సీజ్ చేసి ఆర్టీవో కార్యాలయానికి తరలించారు. మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు ప్రతాప్ రాజ్, ఆర్ బాబు, శిల్ప, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బోరుబావి విద్యుత్ వైర్లు మాయం


బోరు బావి విద్యుత్ వైర్లను దొంగిలించిన దృశ్యం

సుభాష్‌నగర్: ఇటీవల వేసవికాలం సెలవుల్లో పాఠశాలలోని స్టార్టర్ నుంచి బోరు మోటర్‌కు వెళ్లే వైరును, పైపులను దొంగలు దోచుకెళ్లారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న బోరు మోటర్ వైర్ గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించడంతో మంచి నీటికి ఇబ్బందులు తలెత్తాయి. 600 పైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఈ బోర్డు మీద ఎంతగానో ఉపయోగపడేది. అధికారులు స్పందించి వైరును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతులు


ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు

కుత్బుల్లాపూర్: సమస్యలు లేని నియోజకవర్గంగా కుత్బుల్లాపూర్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయానికి పలు కాలనీలు, బస్తీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు వచ్చి స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్ల హయాంలో చేసిన అభివృద్ధిని మించి నియోజకవర్గాన్ని ముందుకు తీసుకువెళ్తానని, స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


డీఈ శ్రీనాథ్‌రెడ్డిని కలిసిన బాబుసింగ్

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ డివిజన్ 327 యూనియన్ అధ్యక్షుడు బాబుసింగ్ అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన బాబుసింగ్ బుధవారం డీఈ శ్రీనాథ్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా యూనియన్‌లో నూతనంగా చేరిన రవితేజ, కార్తీక్‌నాయక్, అనీల్ నాయక్, శ్రీకాంత్‌లకు స్వాగతం పలికారు. యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని బాబుసింగ్ పేర్కొన్నారు. డీఈని కలిసిన వారిలో రిజనల్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, సెక్రటరీ జగన్, మేడ్చల్ డివిజన్ ప్రెసిడెంట్ అజయ్‌కుమార్ ఉన్నారు.

వెలగని వీధి దీపాలు.. రాకపోకలకు ఇబ్బందులు


గణేష్ టెంపుల్ వీధిలో వెలగని వీధి దీపాలు

నిజాంపేట్: విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయక పోవడంతో చీకట్లు అలుముకుంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజాంపేట్ సాయినగర్‌కాలనీలోని గణేష్ టెంపుల్ వీధిలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. ఈ విషయమై స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదంటున్నారు. రాత్రి సమయంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉన్నతాధికారులు స్పందించి వెలగని విద్యుత్ దీపాలను మార్చి నూతనంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాప్‌లోని లేబర్ అడ్డా వద్ద లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు మాట్లాడుతూ సుమారు 55 మంది కార్మికులు పరీక్షలు చేయించుకున్నారు. త్వరలోనే షాపూర్ నగర్, శ్రీనివాస్‌నగర్‌లోని కార్మికుల అడ్డాల్లో కూడా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్, హరినాథ్, సీపీఐ నాయకుడు ప్రవీణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జగద్గిరిగుట్ట అధ్యక్ష, కార్యదర్శులు శామ్యుల్, ముసలయ్య, యాదగిరి, రాంచందర్ పాల్గొన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురావాలి


ఉప కమిషనర్ నరసింహకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: ఫుట్‌ఓవర్ బ్రిడ్జిను వెంటనే వినియోగంలోని తేవాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు కేశవ్‌యాదవ్, జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడు పులి బలరాం మాట్లాడుతూ షాపూర్‌నగర్ చౌరస్తాలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా ప్రారంభానికి నోచుకోవడం లేదని, దీంతో పాదాచారులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బ్రిడ్జిని ప్రారంభించి ఇబ్బందులు తొలగించాలని కోరారు. అందించిన వారిలో బీజేపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్ రంగంపేట, అసెంబ్లీ కన్వీనర్ సాయి జయంత్, జాయింట్ కన్వీనర్ చంద్రశేఖర్, నిజాంపేట్ కన్వీనర్ సురేశ్, కో కన్వీనర్ నాగరాజు, గుట్ట కన్వీనర్ రాము, చింతల్ కన్వీనర్ ప్రశాంత్, జూల సందీప్ తదితరులు ఉన్నారు.

నేడు జైదుర్గా నవదుర్గా ఆలయ వార్షికోత్సవం



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని సీసాల బస్తీలోని జైదుర్గా నవదుర్గా ఆలయ వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం అమ్మవారికి ప్రతేక పూజలు, చండీహోమం, సాయంత్రం 5గంటలకు 108 కలశాలతో గండాదీపం, ఊరేగింపు ఉంటుందని పేర్కొంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరింది.

అదనపు స్టోరేజ్ ట్యాంక్‌ను మంజూరు చేయాలి


వినతి పత్రం అందజేస్తున్న కార్యవర్గ సభ్యులు

సుభాష్‌నగర్: అదనపు స్టోరేజ్ ట్యాంక్‌ను మంజూరు చేయాలని కోరుతూ గాజులరామారం డివిజన్ మహదేవపురం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సర్కిల్ అధికారులను బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి మాట్లాడుతూ తమ ప్రాంతంలో బోర్లు ఎండిపోవడంతో మంజీర నీటిపైనే ఆధారపడుతున్నామన్నారు. అయితే నాలుగైదు రోజులకు ఒకసారి నీళ్లు సరఫరా చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కొత్త బోరు వేసి 10 మిలియన్ లీటర్ల స్టోరేజ్ ట్యాంక్‌ను ఏర్పాటు చేస్తే నీటి సమస్య తీరుతుందన్నారు. అందించిన వారిలో వైస్ ప్రెసిడెంట్లు రంగారావు, జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌బాబు, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక



సుభాష్‌నగర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ అన్నారు. ఇటీవల కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం ఆయనను కుత్బుల్లాపూర్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్ఎంటీ స్థలాన్ని పరిరక్షించాలి


హెచ్ఎంటీ అధికారితో చర్చిస్తున్న బీజేపీ నేత మల్లారెడ్డి

చింతల్: అన్యాక్రాంతమవుతున్న హెచ్ఎంటీ స్థలాన్ని పరిరక్షించాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి అన్నారు. స్థానిక నేతలతో కలిసి బుధవారం ఆయన కంపెనీని, కబ్జాకు గురువుతున్న అయా స్థలాలను పరిశీలించారు. అనంతరం హెచ్ఎంటీ కంపెనీ జనరల్ మేనేజర్ రాజాబాబును కలిసి కబ్జాల విషయమై చర్చించారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ మున్సిపల్ ఆఫీస్ పక్కన గల హెచ్ఎంటీ స్థలంలో అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున కబ్జాలకు పాల్పడి ఆ ప్రాంతాన్ని జేసీబీలతో చదును చేయిస్తున్నారని అంతేకాకుండా షాపూర్‌నగర్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో వందల సంఖ్యలో లారీలతో డంపింగ్ చేస్తున్న విషయాలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆగ్రో ఇండస్ట్రీస్‌కి సంబంధించిన స్థలాన్ని సందర్శించి ఆ సంస్థ మేనేజర్ వెంకన్నను కలిశారు. ఆయన వెంట ఆ పార్టీ నేతలు ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి


స్కూల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు సామాజిక దృక్పథంతో వ్యవహరించాలని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో విద్య ఉండేలా చూడాలని నిజాంపేట్ కార్పొరేషన 32వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ గ్రీన్‌ఫీడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అమర కిడ్స్ ప్లే స్కూల్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమర పద్మజ, రాకేష్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్, బీసీ సెల్ అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి


ఇంటి ముందు ఇంకుడు గుంతను శుభ్రం చేస్తున్న రవీందర్ ముదిరాజ్

సుభాష్‌నగర్: నీటి తీవ్రతను ఎదుర్కొంటున్న బెంగళూరు మాదిరిగా మన నగరం కావద్దంటే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని పర్యావరణ పరిరక్షకుడు రవీందర్ ముదిరాజ్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీలోని తన ఇంట్లో 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను తండ్రి రిటైర్డ్ హెచ్ఎం ఈశ్వరయ్యతో కలిసి బుధవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ తన ఇంట్లో ఇంకుడు గుంత ఉండడం వల్ల 210 అడుగులకే సరిపడా నీళ్లు వస్తున్నాయన్నారు. 125 గజాలు దాటిన ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకుంటేనే బోరు, ఇంటి, నల్లా కనెక్షన్ పర్మిషన్ ఇవ్వాలని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

త్రిపుర గవర్నర్‌కు సన్మానం

సుభాష్‌నగర్: త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని బుధవారం రాజ్‌భవన్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు నటరాజ్‌గౌడ్, విఘ్నేశ్వర్, చండి ముదిరాజ్, పిసరి కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, సీతారామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


ఇంద్రసేనారెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ప్రమాదం పొంచి ఉంది..
యంత్రాంగం నిద్రలో ఉంది!

చింతల్ చురుకుపల్లి కాలనీ ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడి నుంచి వెళ్లే వాహనదారులు మూడు రోజులుగా ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇది గమనించిన స్థానికులు ప్రమాద సూచికకగా ఓ కర్రను ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

– జగద్గిరిగుట్ట

